సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం । 4 । మార్చి । 2024



సామాజిక స్ఫూర్తినిచ్చిన నాటికలు

వర్ధన్నపేట పట్టణంలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన నాటికలు సామాజిక స్ఫూర్తినిచ్చాయి.

- 8లో▸



విద్యుత్ సంస్థలను బలోపేతం చేయాలి

- 8లో▸

విద్యుత్ సంస్థలను బలోపేతం చేయాలని పీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0°/23.0°

జిల్లాలో ఉదయం ఆహ్లాదంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్ర పెరుగుతుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉద్యోగార్థులను హైదరాబాద్ తీసుకెళ్లాలి

భూపాలపల్లి రూరల్: షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుక బడిన తరగతులు, మైనార్టీ సంక్షేమం, పోలీస్, వైద్య ఆరోగ్య ,కుటుంబ సంక్షేమ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను హైదరాబాద్ తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదివారం ప్రకటనలో ఆదేశించారు. ప్రభుత్వ గురుకుల లెక్చరర్స్, టీచర్స్, పోలీస్, మెడికల్ ఉద్యోగాలు సాధించిన సిబ్బందికి సోమవారం హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. దీంతోపాటు ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన హెల్ప్ డెస్కులు ఏర్పాటుపై కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సోమవారం ఉద్యోగం సాధించిన వారికి ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు. జిల్లానుంచి 65మంది అభ్యర్థులు వివిధ పోస్టులకు ఎంపికయ్యారని తెలిపారు.

ప్రవేశపరీక్ష ప్రశాంతం

భూపాలపల్లి అర్బన్: మహాత్మ జ్యోతిరావు పూలే అర్హత పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి డాక్టర్ రామ్‌కుమార్, పరీక్ష కన్వీనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలోని గురుకులాల్లో 6 నుంచి 8వ తరగతి వరకు ఖాళీగా మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈ పరీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర, శ్రీ చైతన్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, తేజస్విని గాంధీ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 1,070 మంది విద్యార్థులకు 976 మంది ప్రవేశ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

'కారు' దిగిన జెడ్పీటీసీ



టేకుమట్ల: టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా సాక్షితో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 5సంవత్సరాలు జెడ్పీటీసీగా పని చేశానని, ప్రస్తుతం మండల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో పని చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో భవిష్యత్ ప్రణాళికను వెల్లడిస్తానన్నారు.

విధుల్లో చేరిన పీఓ చిత్రామిశ్రా



ఏటూరునాగారం: ఐటీడీఏ పీఓగా చిత్రామిశ్రా ఆదివారం విధుల్లో చేరారు. ఐటీడీఏ పీఓగా ఇక్కడ పనిచేసిన అంకిత్‌ను నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు గత నెల 12న జారీ అయ్యాయి. అయితే మేడారం మహాజాతర ఉండడం వల్ల ఇన్నాళ్లు అంకిత్ పీఓగా కొనసాగారు. నేటి నుంచి ఐటీడీఏ పీఓగా చిత్రామిశ్రా కార్యాలయంలో విధులు నిర్వర్తించనున్నారు. నేడు(సోమవారం) జరిగే గిరిజన దర్బార్‌కు సైతం అన్ని శాఖల అధికారులు రావాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. హాజరు కాని అధికారులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని వెల్లడించారు.

మరుగుదొడ్ల గుంతల పూడ్చివేత



ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మక్క- సారలమ్మ జాతర సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల గోతులను పూడ్చి వేస్తున్నారు. 'కంపు కొడుతున్న మరగుదొడ్లు' శీర్షికన ఈ నెల 2న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఆదివారం నుంచి మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంక్‌ల పూడ్చివేతకు చర్యలు చేపట్టారు. ట్రాక్టర్ డోజర్లతో మరుగుదొడ్ల గోతులను పూడ్చివేస్తున్నారు.

జెట్ విమానం చక్కర్లు

ఏటూరునాగారం/ఎస్ఎస్ తాడ్వాయి: ఏటూరునాగారం, ఎస్ఎస్ తాడ్వాయి మండలాల మీదుగా ఆదివారం జెట్ విమానం చక్కర్లు కొట్టింది. నాలుగైదుసార్లు తక్కువ ఎత్తులో విమానం చక్కర్లు కొట్టడాన్ని చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. జాతర ముగిసిన తర్వాత ఇలా విమానం చక్కర్లు కొట్టడం ప్రజలకు అంతు చిక్కని ప్రశ్నగా మారింది. కొందరు మాత్రం ఛత్తీస్‌గఢ్‌కు రైల్వే సర్వే కోసం జెట్ విమానం ద్వారా సర్వే నిర్వహించినట్లు పుకార్లు పుట్టించారు. అధికారులు వివరణ ఇస్తే తప్పా దీనిపై ప్రజలకు స్పష్టత వచ్చే పరిస్థితి లేదు.

మహదేవపూర్ మండలం బీరాసాగర్ వద్ద చిన్న కాళేశ్వరం ఇన్‌టేక్‌వెల్ పంపుహౌస్(ఫైల్)



చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు అడుగులు!

పూర్తి చేస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు

- కాటారం సబ్‌డివిజన్‌కు మేలు
- భూసేకరణతో నిలిచిన పనులు
- త్వరలో పనులకు గ్రీన్‌సిగ్నల్
- ఇప్పటికే ఫీటు మేర కుంగిన బీరాసాగర్ పంపుహౌస్

కాళేశ్వరం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు (శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఎత్తిపోతల పథకం) కొత్త అడుగులు పడుతున్నాయి. ఈ ప్రాంత ప్రజలు కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. గత 15 ఏళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి, ఇప్పటి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు ఇప్పటికైనా పూర్తవుతుందని ఆశాభావంతో మంథని నియోజవర్గం రైతులు ఎదురుచూస్తున్నారు. పెండింగ్ పనులు, భూసేకరణ పూర్తిచేస్తే కాటారం డివిజన్ పరిధిలోని దాదాపు 45 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. తాజాగా సమావేశంలో త్వరగా పనులు చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. మహదేవపూర్ మండలం మెట్‌పల్లి(కన్నెపల్లి) సమీపంలోని బీరాసాగర్ వద్ద గోదావరి జలాలను ఎత్తిపోసి కాటారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్ మండలాల్లో 45 వేల ఎకరాలకు సాగు, తాగునీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి 2008, సెప్టెంబరు 19న శంకుస్థాపన చేశారు. రూ.499కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. అంచనా వ్యయం రూ.577 కోట్లకు చేరింది. ఈక్రమంలో నిర్మాణ ఏజెన్సీ అప్పటి ధరలకు పనులు చేయలేమని చేతులెత్తినట్లు తెలిసింది.

ప్రాజెక్టు వివరాలు..

ఈ పథకం అంచనా వ్యయం రూ.577కోట్లు. ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.370 కోట్లు. ఈ చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల లక్ష్యం రోజుకు 4.5 టీఎంసీలు తరలింపు. ఈ పథకం ద్వారా సాగు అంచనా ఆయకట్టు 45,280 ఎకరాలు. ప్రాజెక్టు ద్వారా మొత్తం 14 ప్రధాన చెరువులకు లింకు చేయడం. మహదేవపూర్ 10,077 ఎకరాలు, కాటారం 26,815 ఎకరాలు, మహముత్తారం 6,762 ఎకరాలు, మల్హరావు 1,626. మొత్తం 2,952 ఎకరాలు అవసరం కాగా ఇప్పటి వరకు సేకరించిన భూమి 891 ఎకరాలు మాత్రమే. ఇంకా సేకరించాల్సిన 2,060 ఎకరాల్లో అటవీశాఖ భూమి కూడా ఉంది. 12 చెరువులకు 6 చెరువుల పనులు పూర్తయ్యాయి.

భూసేకరణలో జాప్యం

ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ముఖ్యమైన అనుమతులు వచ్చినా భూసేకరణలో జాప్యం ఏర్పడుతుంది. సేకరించిన భూములకు పరిహారం అందించడంలో ఆలస్యం కావడంతో రైతులు పనులను అడ్డుకుంటున్నారు. ప్రాజెక్టుకు అనుసంధానంగా పూర్తి చేసిన చెరువులు గండిపడగా వాటిని పునరుద్ధరించాల్సి ఉంది. కాటారం పంప్ హౌస్ సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పనులు సైతం ఆగిపోయాయి. క్షేత్రస్థాయిలో సమగ్రంగా ప్రాజెక్ట్ స్థితిగతులను విశ్లేషించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఆనాడు కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టడం, ఈ ప్రాంతం నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో చిన్న కాళేశ్వరం ఇబ్బందులు తప్పనున్నాయి. ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో చిన్న కాళేశ్వరం ఇరిగేషన్ ఇంజనీర్లు సమావేశమయ్యారు. కారణాలు తెలుసుకుని, త్వరగా పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో భూసేకరణపై చర్చించినట్లు సమాచారం. వరదల కారణంగా బీరాసాగర్ వద్ద పంపుహౌస్ ఫీటు మేర కుంగినట్లు ఆయన సమాచారం అందించినట్లు తెలిసింది. మరమ్మతులు చేయాల్సి ఉంది. దీంతో ఈ మేరకు ఈఎన్‌సీ అనీల్‌కుమార్, సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ, డీఈఈలు రెండు రోజుల కిందట పరిశీలించారు. ఈవిషయమై పలుమార్లు ఇరిగేషన్‌శాఖ ఇంజనీర్లను సంప్రదించేందుకు సాక్షి ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

ఎన్నో కారణాలు..

2017లో పనులు పునఃప్రారంభించిన పనులు నాలుగేళ్లలోనే పూర్తి చేయాల్సి ఉన్నా.. పలు కారణాలతో పనులు ఆగిపోయాయి. మహదేవపూర్ మండలంలోని బీరసాగర్, కాటారంలో పంప్ హౌస్‌లు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు, పైప్‌లైన్, కాల్వలు, చెరువుల పనులు చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్న కాళేశ్వరంగా పేరు మార్చింది. అటవీ, పర్యావరణ తదితర అనుమతులు తీకొచ్చి, నిర్మాణ వ్యయాన్ని పెంచారు. 65శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా.. 2022 జూలై 14, 15న వరదలకు బీరసాగర్‌లోని పంప్ హౌస్‌లోకి వరద నీరు చేరి దెబ్బ తిన్నది.

గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ



తల్లులకు మొక్కులు

- మేడారానికి పోటెత్తిన భక్తులు
- జంపన్నవాగు వద్ద షవర్లు లేక ఇక్కట్లు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో రాష్ట్రం నలుమూల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి కూడా వేలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగులోని నిల్వ నీటినిలో స్నానాలు ఆచరించి పుట్టువెంట్రుకలు సమర్పించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద ఎత్తు బంగారం, ఒడి బియ్యం, పసుపు, కుంకుమ, చీర సార, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నేరుగా గద్దెల పైకి వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో అమ్మవార్ల గద్దెలు కిటకిటలాడాయి. జాతర ముగిసి వారం రోజులు గడుస్తున్నా భక్తుల తాకిడి మాత్రం తగ్గలేదు. మొక్కుల అనంతరం జాతర పరిసరాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

విజృంభిస్తున్న ఈగలు..

మేడారంలో ఈగలు విజృంభిస్తున్నాయి. ఎక్కడా చూసిన కుప్పలుగా వాలిపోతున్నాయి. పారిశుద్య కార్మికులు జాతరలోని చెత్తను తొలగిస్తున్నా ఈగల మోతమోగుతుంది. ప్రధానంగా అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో కొబ్బరి, బెల్లంతో ఈగల తాకిడి పెరిగింది. అధికారులు స్పందించి ఈగల నివారణకు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి బ్లీచింగ్, స్ప్రే చల్లాలని భక్తులు కోరుతున్నారు. అంతేకాకుండా జంపన్నవాగు స్నానఘట్టాలపై బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌ను తొలగించడంతో భక్తులు స్నానాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. జాతర సమయంలో లక్నవరం చెరువు నుంచి జంపన్నవాగులోకి వదిలిన నీరు అక్కడక్కడ నిల్వ ఉండగా దానిలోనే భక్తులు స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులు స్పందించి జంపన్నవాగు వద్ద కొన్ని షవర్లను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



గద్దెల సమీపంలో గంటలు కొడుతున్న భక్తులు



యాట మొక్కు చెల్లిస్తున్న భక్తులు

'గృహజ్యోతి' ప్రారంభించిన ఎమ్మెల్యే



జీరో బిల్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

గణపురం: గృహజ్యోతి పథకంలో భాగంగా మండలంలోని చెల్పూరు గ్రామంలో ఆదివారం ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్లలోపు జీరో కరెంటు బిల్లును లబ్ధిదారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేసిందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షల పెంచినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో త్వరలో ఇందిరమ్మ పథకం కింద 3,500 ఇళ్లను మంజూరు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు విడిదినేని అశోక్, కావటి రవి, ఎండీ చోటే మియా, కొత్త వెంకన్న, సూరినేని సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం



చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి అర్బన్: పోలియో రహిత సమాజమే లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. భారతదేశం పోలియో రహిత దేశం అన్నారు. ఇప్పటికీ కొన్ని దేశాల్లో పిల్లలు పోలియో బారిన పడుతున్నారని తెలిపారు. పోలియో రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసం అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాలలోపు పిలలకు ప్రతి సంవత్సరం పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కులు అవసరమని జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రారావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సబ్‌సెంటర్ అవరణంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమానికి న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పల్స్ పోలియో క్యాంపు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్‌రెడ్డి, ప్రోగ్రాం ,అధికారులు డాక్టర్ శ్రీదేవి, అన్వేషిని, ఉమాదేవి, మాస్ మీడియా ఆఫీసర్ శ్రీదేవి, సీహెచ్‌ఓ రాజయ్య, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతిరెడ్డికి తెలంగాణ ఉత్తమ రైతు అవార్డు



సువర్ణ కంకణాన్ని స్వీకరిస్తున్న శాంతిరెడ్డి

రేగొండ: మండల కేంద్రానికి చెందిన ఏడెల్లి శాంతిరెడ్డి తెలంగాణ ఉత్తమ రైతుగా అవార్డు అందుకున్నారు. వ్యవసాయంలో నూతన ఆలోచనలు, ఆధునిక పద్ధతులను అవలంభిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడంతోపాటు సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న సమాజ సేవలోను భాగస్వామ్యులయ్యారు. దీంతో ఉగాది మహోత్సవాల సందర్భంగా సర్.సీవీ రామన్ అకాడమీ (సేవా సాంస్కృతిక సంస్థ) అధ్యక్షుడు అయన్ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రావు శాంతిరెడ్డికి సువర్ణ ఘంటా కంకణం, అవార్డు, ప్రశంస పత్రాన్ని అందజేశారు.

మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు

ఏటూరునాగారం: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని మహిళా ఉద్యోగులందరికీ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలురాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గిరిజన భవన్‌లో పోటీలు కొనసాగుతాయని వివరించారు. షటిల్, క్యారం, టెన్నికాయిట్, అంతాక్షరి, లెమన్ జ్యూస్, మ్యూజికల్ చైర్, చెస్, స్కిప్పింగ్, సింగింగ్ ఇలా తదితర పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ నెల 7వ తేదీన కలెక్టరేట్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌నందు ఈ పోటీలు ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్న మహిళా ఉద్యోగులందరూ సెల్ నంబర్ 87900 50058 ,9949638724లలో సంప్రదించాలని కోరారు.

'ఎన్‌క్వాస్' గుర్తింపు

వెలిశాల పీహెచ్‌సీకి అరుదైన గౌరవం

- జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం
- రాష్ట్రస్థాయిలో మూడోస్థానం



వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

టేకుమట్ల: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు(''ఎన్‌క్వాస్'' నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్) గుర్తింపు లభించింది. రాష్ట్రంలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గుర్తింపు రాగా వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. ''ఎన్‌క్వాస్'' గుర్తింపు ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రూ.3లక్షల నిధులను మూడు సంవత్సరాల పాటు మంజూరు చేయనుంది. జిల్లాలో పీహెచ్‌సీ ప్రథమ స్థానంలో నిలువడంపై, పీహెచ్‌సీ సిబ్బంది, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌క్వాస్ బృందం ప్రతీ మూడేళ్లకోసారి దేశంలోని ఆస్పత్రులను పరిశీలించి గుర్తింపు ఇస్తుంది. అందులో భాగంగానే 2023, డిసెంబర్ 29, 30తేదీల్లో జాతీయ వైద్య ఆరోగ్య శాఖ బృందం సభ్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, ల్యాబోరేటరీ సర్వీసెస్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, నేషనల్ హెల్త్ ప్రోగ్రాం, తదితర విభాగాల్లో పనితీరు, పురోగతిని పరిశీలించారు. ఆస్పత్రిలో నాణ్యతా ప్రమాణాలు, రోగులకు అందించే వైద్య సేవలు, ఆస్పత్రి ఆవరణ పరిసరాల పరిశుభ్రత, ఆస్పత్రి రికార్డుల నిర్వాహణ, వివిధ రకాల సౌకర్యాలన్నింటినీ కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ భరణికుమార్ అంబల్గన్, డాక్టర్ యతీంద్రకుమార్‌శర్మలు క్షుణ్ణంగా పరిశీలించి, వైద్య సేవలు, పలు అంశాలపై సిబ్బంది, రోగులను ప్రశ్నించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆస్పత్రిలో ఆహ్లాదం

వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణమంతా చెట్లనీడతో నిండి ఉంటుంది. రోగులు సేదదీరేందుకు ఆస్పత్రి ఆవరణలో మినీ పార్క్ ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తుంది. ప్రత్యేకంగా పార్క్‌లో వివిధ రకాల మొక్కలను పెంచుతూ నిత్యం వాటిని పర్యవేక్షిస్తుంటారు. పరిశుభ్రతకు మారుపేరుగా వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అద్భుతంగా కనిపిస్తుంది.

ఎన్‌క్వాస్ గుర్తింపుతో రూ.9లక్షలు..

జాతీయ స్థాయిలో ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన ప్రతీ ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వం రూ.9లక్షల నిధులు మంజూరు చేస్తుంది. ఏడాదికి రూ.3లక్షల చొప్పున 3సంవత్సరాలకు రూ.9లక్షల నిధులు మంజూరు కానున్నట్లు ఆస్పత్రి వైద్యాధికారి వెల్లడించారు. ఈ నిధులతో ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించడమే దీని లక్ష్యం.

రాష్ట్ర స్థాయి గుర్తింపు

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలో ''ఎన్‌క్వాస్'' గుర్తింపు పొందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లాలోని, టేకుమట్ల మండలంలోని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాష్ట్రస్థాయిలో గుర్తింపు వరించింది. రాష్ట్రంలోనే 3వ స్థానం లభించడంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆస్పత్రి వైద్యాధికారి, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో 'ఎన్‌క్వాస్' గుర్తింపు లభించినట్లు తెలిసింది.

చాలా ఆనందంగా ఉంది



కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నాం. మా పీహెచ్‌సీకి తొలిసారి 'ఎన్‌క్వాస్' గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. సమష్టి కృషితో గుర్తింపు సాధించాం.

- డాక్టర్ ఆశాజ్యోతి,
మెడికల్ ఆఫీసర్ పీహెచ్‌సీ వెలిశాల

'బొగ్గు రవ్వలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్ : సికాస(సింగరేణి కార్మిక సమాఖ్య) ఉద్యమ చరిత్ర నేటి యువ కార్మికులకు తెలిపేందుకు బొగ్గు రవ్వలు పుస్తక రచన చేసినట్లు రచయిత, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గురిజాల రవీందర్ తెలిపారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బొగ్గు రవ్వలు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత రవీందర్ మాట్లాడారు. సింగరేణిలో గతంలో జరిగిన కార్మిక ఉద్యమాలు వీరుల త్యాగాలు నేటి సమాజానికి తెలియజేసేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. 1972నుంచి సింగరేణిలో సికాస ఉద్యమం ఏ విధంగా కొనసాగింది.. వాటి వివరాలను పూర్తిగా పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ జానకిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు రమణచారి, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


బొమ్మకంటి వంశీ

దామెర : ల్యాదెల్లకు చెందిన యువకుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెల్లకు చెందిన యువకుడు బొమ్మకంటి వంశీ చిన్నతనం నుంచి మతిస్థిమితం సరిగా లేకుండా చుట్టు పక్కల గ్రామాల్లో తిరుగుతుండే వాడు. పొద్దంతా ఎక్కడికి వెళ్లినా రాత్రికి ఇంటికి చేరుకునేవాడు. కాగా ఫిబ్రవరి 27న ఇంటి నుంచి బయటికి వెళ్లిన వంశీ తిరిగి రాలేదు. దీంతో వంశీ తండ్రి పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వంశీ చామనఛాయ రంగు కలిగి, కోల ముఖం, 5 ఫీట్ల ఎత్తు ఉంటాడన్నారు. నీలిరంగు ప్యాంట్, ముదురు నీలి రంగు షర్ట్ వేసుకుని ఉన్నట్లు వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు 87126 85020, 87126 85228 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అరవింద్‌రెడ్డి (ఫైల్)

నెక్కొండ : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన రావుల అరవింద్‌రెడ్డి (20) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అరవింద్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో అరవింద్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తండ్రి మధుకర్ రెడ్డి, తల్లి రజిత, చెల్లి హర్షిత ఉన్నారు. అరవింద్‌రెడ్డి మృతితో నెక్కొండలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన డీసీఎంలు

మహదేవపూర్ : అక్రమంగా తరలిస్తున్న 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్థానిక యువకులు ఆదివారం మండల కేంద్రంలో పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ కరీంనగర్‌లోని సుమంగళి ట్రేడర్స్ నుంచి మహారాష్ట్రలోని జానకి ట్రేడర్స్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని కాటారంలోని అన్నపూర్ణ రైస్ మిల్లులో భద్రపరుస్తామన్నారు. డీసీఎం డ్రైవర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా, యువత.. రేషన్ బియ్యం అక్రమ రవాణపై తమకు సమాచారం ఇవ్వాలన్నారు.



కడుపు 'ఉబ్బరం'తో కలవరం

- పశువులకు సోకుతున్న అరుదైన వ్యాధి
- ఆందోళనలో పాడి యజమానులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు



కరీమాబాద్ : పశువుల్లో కడుపు 'ఉబ్బరం' వ్యాధి కలవరపెడుతోంది. పశువులకు సోకుతున్న వ్యాధితో యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. సాధారణంగా పశువులకు కొన్ని సీజనల్ వ్యాధులు వస్తాయి. అయితే కడుపు ఉబ్బరం వ్యాధి మాత్రం పాడి పశువులలో అరుదుగా కనిపిస్తుంది. దీనిపై జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించి ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని చెబుతున్నారు.

వ్యాధి రెండు రకాలు..

పశువులకు సోకుతున్న కడుపు ఉబ్బరం(బ్లోట్) వ్యాధి రెండు రకాలు ఉంటుంది. వాటిలో ఒకటి ప్రైమరీ బ్లోట్, రెండో ఫ్రోతీబ్లోట్. ఈ వ్యాధులు ఎక్కువగా మేతకు సంబంధించిన కారణాలతోనే వస్తుంటాయి.

మేతకు సంబంధించి..

చెట్ల ఆకులు, గడ్డిని ఎక్కువగా తినిపించడం, లెగ్యూమ్ జాతి గడ్డి రకాలను ఎక్కువగా మేపడం, రెడ్‌క్లోవర్, అల్ఫా వంటి గడ్డి జాతులను ఎక్కువగా మేపడం, యూరియా చల్లిన ధాన్యపు జాతి గడ్డి రకాలను మేపడం, ఉడకబెట్టిన అన్నం అధికంగా తినిపించడం ద్వారా కూడా ఈ వ్యాధి సోకుతుంది. ఇక ఫ్రోతీ బ్లోట్ సోకేందుకు పచ్చిగడ్డిలో ఉండే సైటోప్లాస్మిక్ ప్రోటీన్ల మూలంగా నిరంతరం కడుపు(రూమెన్)లో నురగ తయారవుతుంది. అధిక కాల్షియం, తక్కువ ఫాస్పరస్ గల గడ్డి రకాలు, హిస్టమిన్, హైడ్రోజన్ సల్ఫైడ్ అధికంగా ఉండే లెగ్యూమ్ జాతి గడ్డి రకాలను ఎక్కువగా మేపడంతో కడుపులో నురగ తయారవుతుంది.


కడుపు ఉబ్బిన ఆవు

వ్యాధి క్రమం..

పశువుల కడుపు, రెటిక్యులంలో అధికంగా గాలి తయారవడం లేదా తయారైన గాలి బయటకు వెళ్లక పోవడం మూలంగా కడుపులో గాలి శాతం పెరిగి ఉబ్బుతాయి. ఫలితంగా విభాజక పటలంపై ఒత్తిడి పెరిగి ఊపిరితిత్తులలో హైపాక్సియం స్థితి ఏర్పడి పశువులు మృత్యువాత పడొచ్చు. గుండెలో టాకికార్డియా ఏర్పడి నాడి రేటు పెరిగి కొన్ని సందర్భాల్లో పశువుల గుండె ఆగి మృత్యువాత పడొచ్చు.

వ్యాధి లక్షణాలు..

పశువుల్లో కడుపు గాలితో నిండి ఉంటుంది. ఫలితంగా చేతివేళ్లతో తట్టినప్పుడు డ్రమ్ లాంటి శబ్దం వినిపిస్తుంది. నోటి నుంచి చొంగ కారుతుంది. నాలుక బయటకు పెట్టి పళ్లు కొరకడం, తల పైకెత్తి శ్వాస కష్టంగా తీసుకోవడం, పదే పదే పొట్టను చూస్తూ కాళ్లతో తన్నుకోవడం, విరేచనాలవుతాయి. ఆకలి మందగించి పశువులు నీరసంగా ఉంటాయి. శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది.

వ్యాధి నివారణకు...

ఉబ్బరం తగ్గే వరకు పశువులకు ఎలాంటి ఆహారం, నీరు పెట్టొద్దు. పశువుల ముందు భాగం(తల వైపు భాగం) ఎత్తుగాను, వెనక భాగం పల్లంగా ఉండేలా చూడాలి. చార్కోల్ గానీ చెక్కముక్క గానీ నోట్లో పెడితే లాలాజలం ఉత్పత్తి పెరిగి కడుపులో నురగతో కూడిన గాలి తగ్గుతుంది.

పశువులకు చికిత్స...

సోడియం బైకార్బొనేట్‌ను తగిన మోతాదులో నీటిలో కలిపి తాగించాలి. వేరుశనగ, నువ్వుల నూనె 500 ఎంఎల్ నుంచి లీటర్ వరకు తాగించొచ్చు. బ్లోటోసిల్, బ్లోటోనిల్, టింపానిల్ లాంటి ద్రావణాలను 80–90 ఎంఎల్ వరకు తాగిస్తే ఫలితం ఉంటుంది. పశువులు త్వరగా కోలుకునేందుకు సెలైన్‌ను ఎక్కించడంతోపాటు మల్టీ విటమిన్లు, మినరల్ కలిగిన ఇంజక్షన్లు ఇస్తే పశువులకు ఎంతో ఉపయోగం ఉంటుంది.

పశువులను గమనిస్తుండాలి



పశువుల మేత విధానాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. కడుపు ఉబ్బరం ఉన్నప్పుడు చొంగ కారడం, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. కడుపు ఉబ్బినట్టు కనిపించగానే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువులకు చికిత్స అందించిన తర్వాత అవి వెంటనే మేత మేయలేవు. అందుకే సెలైన్ బాటిల్స్ ఎక్కించాలి. మల్టీవిటమిన్ ఇంజక్షన్లు వేయించాలి.

-డాక్టర్ శశాంక్, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

రైతుపై పగ.. పశువులను చంపిన దుండగులు

- నీటి తొట్టిలో యూరియా కలిపిన వైనం
- ఆ నీటిని తాగిన మూడు మూగజీవాలు మృత్యువాత

రఘునాథపల్లి : రైతు మీద పగతో పశువుల ప్రాణం తీశారు. నీటి తొట్టిలో యూరియా కలపడంతో అందులోని నీటిని తాగిన రెండు ఆవులు, ఒక కోడె మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన ఆదివారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గిద్దబండతండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన బానోత్ తిరుపతి ఇటీవల వరి పంటకు యూరియా చల్లగా.. మిగిలిన సగం బస్తా యూరియా పశువుల పాకలో నిల్వచేశాడు. శనివారం తన రెండు ఆవులు, ఒక కోడెను పశువుల పాకలో కట్టేసి ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న దుండగులు పాకలో ఉన్న యూరియాను నీటి తొట్టిలో కలిపారు. సాయంత్రం తిరుపతి భార్య సునీత పాకలో ఉన్న పశువులను వదలడంతో అవి తొట్టిలోని నీళ్లు తాగాయి. రాత్రి సమయంలో ఓ ఆవు ప్రాణం వదలగా, మిగతా రెండు ఆదివారం ఉదయం మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనపై పశువైద్యుడిని తీసుకురాగా విష ప్రయోగం జరిగినట్లు నిర్ధారించారు. పాకలో ఉన్న యూరియా కనిపించకపోవడంతో నీటి తొట్టిని పరిశీలించారు. అడుగు భాగంలో యూరియా ఆనవాళ్లు ఉండడంతో గిట్టని వారు చేసిన పనిగా బాధితులు కన్నీరు మున్నీరవుతున్నా రు. కాగా, మృత్యువాత పడిన పశువుల విలువ రూ.లక్షా పదివేలు ఉంటుందని బాధితులు తెలిపారు.



విషపు నీరు తాగి మృత్యువాత పడిన ఆవులు

సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ కె.తిరుమల్‌రావు

హన్మకొండ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చైర్మన్ కె.తిరుమల్‌రావు తెలిపారు. ఈ నెల 6న జనగామ డివిజన్ రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో నర్మెట, ఖిలాషాపూర్, రఘునాథపల్లి, తరిగొప్పుల సెక్షన్ పరిధి వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. 7న హనుమకొండ రూరల్ డివిజన్ ధర్మసాగర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టుకు ఐనవోలు, ధర్మసాగర్, పంథిని, 13న హుజురాబాద్ డివిజన్ జమ్మికుంట సబ్‌డివిజన్ పరిధి తనుగుల సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టుకు చల్లూరు, జమ్మికుంటరూరల్, జమ్మికుంట రూరల్ వెస్ట్, జమ్మికుంట టౌన్, తనుగుల, వీణవంక, 19న భూపాలపల్లి డివిజన్ కాటారం సబ్‌డివిజన్ పరిధి మహాముత్తారం సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో కాటారం, కొయ్యూరు. మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల సెక్షన్ పరిధి వినియోగదారులు ఫిర్యాదులు అందజేయాలని సూచించారు. ఈ లోకల్ కోర్టులు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మేడారం హుండీ ఆదాయం రూ.71 లక్షలు


భక్తురాలు పేపర్‌పై రాసిన కోరిక

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర హుండీ లెక్కింపు నాలుగో రోజు ఆదివారం కొనసాగింది. 88 ఐరన్ హుండీలు విప్పి కానుకలు లెక్కించగా రూ.71,67,000 ఆదాయం లభించింది. గడిచిన మూడు రోజులు నిర్వహించిన లెక్కింపులో రూ.9,60,36,000 వచ్చాయి. నాలుగో రోజుతో కలుపుకుని 405 హుండీల్లో రూ.10,32,03,000 ఆదాయం నమోదైంది. ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేశామని మేడారం ఈఓ రాజేంద్రం తెలిపారు. ఇదిలా ఉండగా ఓ భక్తురాలు.. మా ఆయన బెట్టింగ్ మానేయాలి.. మా అక్క కొడుక్కి ఐఐటీలో సీట్ రావాలి అని రాసిన పేపర్ హుండీలో లభించింది.

కిరాణషాపు దగ్ధం

మహదేవపూర్ : మండలంలోని బొమ్మపూర్ ఎస్సీ కాలనీకి చెందిన మేకల వెంకటి కిరాణషాపు ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. షాపులోని ఫ్రిజ్, బీరువా, ఫర్నిచర్ ఇతర వస్తువులతో పాటు కిరాణసామగ్రి మొత్తం కాలిపోయిందని విలపించాడు. దాదాపు రూ.1,50,000 వరకు నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని రోదించాడు.

సామాజిక స్ఫూర్తినిచ్చిన నాటికలు

వర్ధన్నపేట : భారతీయ నాటక కళాసమితి స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి నాటికల ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి 10 గంటలకు మొదట తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి 'నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత?' అనే నాటికను ప్రదర్శించారు. ఇందులో ఇతివృత్తం ఇలా ఉంది. ఓ విప్లవ రచయిత కుమారుడు కుమార్. విప్లవ భావాలున్న ఆ తండ్రి తన కుమారుడు కుమార్‌కు మరో రచయిత కూతురితో ఆదర్శ వివాహం చేస్తాడు. కానీ ఆమె అతడితో ఇమడలేకపోతోంది. కుమార్ తన తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడం ఆమె భరించలేకపోతోంది. తన కూతుర్ని తీసుకెళ్లిపోతోంది. మరొకరితో అక్రమ సంబంధం ఏర్పరుచుకుంటుంది. అది ప్రశ్నించిన కుమార్‌పై పోలీసు కేసు పెడుతుంది. దీంతో న్యాయస్థానం ద్వారా ఆమెకు మనోవర్తి వస్తుంది. ఈ నిజం తెలిసినా పోలీసులు చట్ట ప్రకారం తాము ఏమి చేయలేమని అంటారు. చివరకు కుమార్ తన కూతురును ఇవ్వాలని భార్యను వేడుకుంటాడు. అయితే పాపను ఇవ్వను సరి కదా.. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందని పాపని అంతమొందిస్తారు. దీంతో అలసిపోయిన కుమార్ కన్నెర్ర చేస్తాడు. సామాన్యుడు అసామాన్యుడవుతాడు. చట్టమే స్వేచ్ఛను ఇస్తే ఇక వీటిని ఆపేదెవరు... ఈ సమాజం ఎటుపోతుంది. మేధావుల నిశ్శబ్దం జాతికి ప్రమాదమని.. ఈ ప్రశ్నల నుంచే ఉద్భవించిందే 'నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత' నాటిక. నటీనటుల హావాభావాలు అందరినీ ఆకట్టుకుంది. అలాగే, రాత్రి 11 గంటలకు కళానికేతన్, వీరన్నపాలెం వారి 'రాజుగారి గోచి' అనే నాటికను రెండో ప్రదర్శనగా వేశారు.


నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత? నాటికలోని ఓ సన్నివేశం

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

- ప్రొఫెసర్ వెంకటనారాయణ

న్యూశాయంపేట: ప్రజాస్వామ్య పరిరక్షణకు పౌరసంఘాలు ఐక్యంగా ఉండి పోరాడాలని ప్రొఫెసర్ వెంకటనారాయణ అన్నారు. ఆదివారం హనుమకొండ ములుగురోడ్డులోని ఓ సమావేశ మందిరంలో డాక్టర్ రాజ్‌మహ్మద్, ముజాహిద్ ఇర్ఫాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్న బీజేపీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌తోపాటు వివిధ పౌరసంఘాల బాధ్యులు ప్రసంగించారు. అనంతరం ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రొఫెసర్ వీరన్న నాయక్, ఉపాధ్యక్షులుగా సోమ రాంమూర్తి, కె.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రాజ్‌మహ్మద్, జాయింట్ సెక్రటరీలుగా చలపతి, కుమారస్వామి, మీడియా ఇన్‌చార్జ్‌గా ఎ.నగేశ్, కోశాధికారిగా ఉదయ్‌సింగ్, అడ్వైజరీలుగా ప్రొఫెసర్ వెంకట్‌నారాయణ, ఎర్రగట్టు స్వామి, ఓం బ్రహ్మం, సాంబయ్య, స్వామిని ఎన్నుకున్నారు. సమావేశంలో జిలుకర శ్రీనివాస్, అజీజ్, అలీమ్, తోఫిఖ్, నదీమ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వివిధ పౌరసంఘాల నేతలు

విద్యుత్ సంస్థల బలోపేతానికి కృషి చేయాలి

- తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య

హన్మకొండ : విద్యుత్ సంస్థల బలోపేతానికి పవర్ ఇంజనీర్లు, ఉద్యోగులు కృషి చేయాలని తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేగ సమ్మయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలో అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలు ఆర్థికంగా బలోపేతం కావాల్సిన అవసరముందని, ఈ దిశగా ఉద్యోగులు తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా అసోసియేషన్‌ను బలోపేతం చేయాలన్నారు. పవర్ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. నాయకత్వం ఎల్లప్పుడు సభ్యులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలు అందిస్తోందన్నారు. సభ్యులకు ఏమైనా ఇబ్బందులుంటే అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా 2024–క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, చీఫ్ అడ్వయిజర్ వరప్రసాద్, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రధాన కార్యదర్శి వంగ రవీందర్, అధ్యక్షుడు ఆర్.పాండు, అడిషనల్ సెక్రటరీ బి.సుధాకర్, జిల్లాల కార్యదర్శులు, ఏఈలు, సబ్ ఇంజనీర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

డీసీఎం, లారీ ఢీ

- 11 మంది కూలీలకు గాయాలు
- పెగడపల్లి క్రాస్ వద్ద ఘటన

హసన్‌పర్తి: డీసీఎం,లారీ ఢీకొన్న ఘటనలో 11 మంది కూలీలు గాయపడ్డారు. ఈఘటన ఆదివారం ఆరెపల్లి–యాదాద్రి జాతీయ రహదారి మధ్యలోని పెగడపల్లి క్రాస్ వద్ద చోటుచేసుకుంది. పెగడపల్లికి చెందిన 11 మంది కూలీలు మిర్చి ఏరడానికి డీసీఎంలో నడికూడకు బయలుదేరారు.అయితే వీరి వాహనం పెగడపల్లి క్రాస్ వద్దకు చేరుకుంది. ఆరెపల్లి వైపు నుంచి బయలుదేరిన లారీ పెగడపల్లి క్రాస్ యూ–టర్న్ తీసుకునే ఈక్రమంలో అదుపు తప్పి డీసీఎంను ఢీకొంది. ఈప్రమాదంలో డీసీఎంలో ప్రయాణిస్తున్న పెగడపల్లికి చెందిన నేనిటి పుష్ప, వేల్పుల రాజమ్మ, రాధక్క, నన్నబోయిన ఐలమ్మ, మ్యాదరబోయిన రాజమ్మ,గండు ఎల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా, డీసీఎం–లారీ ఢీకొన్న ప్రమాదంలో కూలీలు గాయపడిన విషయాన్ని పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కమలాకర్ స్థానిక ఎమ్మెల్యే నాగరాజుకు సమాచారం అందించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఎంజీఎం ఆర్ఎంతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.


గాయపడిన కూలీలు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


రవీందర్(ఫైల్)

దుగ్గొండి : ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలం మహ్మదాపురంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాలడుగుల రవీందర్(52) కొన్నేళ్లుగా ఫర్టిలైజర్ షాపు నడుపుతున్నాడు. నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చేందుకు షాపుతో సహా ఇంటిని విక్రయించినా అప్పు తీరలేదు. భూమి అమ్మి అప్పులు తీర్చుదామని చూడగా అప్పటికే భూమిని రవీందర్ తల్లిదండ్రులు కూతుళ్లకు రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రవీందర్ శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా రవీందర్ అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు.

భార్య మందలించిందని వలస కూలీ..

సంగెం : భార్య మందలించిందని వలసకూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బలంగిర్ జిల్లా పాట్నాగర్ మండలం బూచేపల్లికి చెందిన కలకాను పుటేల్(62) భార్యా పిల్లలతో కలిసి సంగెం మండలం ఆశాలపల్లి శివారులో ఇటుకల తయారీ పనికోసం డిసెంబర్‌లో వలస వచ్చారు. ఈనెల 2న యజమాని కూలి డబ్బులు ఇవ్వగా మద్యం తాగి ఖర్చు చేశాడు. వచ్చిన డబ్బులు తాగుడుకు ఖర్చు చేస్తే బతకడం ఎట్లా అని భార్య జమున పుటేల్‌ను మందలించింది. ఈ క్రమంలో పుటేల్ ఆదివారం తెల్లవారుజామున బయటికి వెళ్లి రాలేదు. చుట్టుపక్కల వెతకగా ఇటుకల బట్టీల పక్కన చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కుమారుడు ఉమాకాంత్ ఉరితాడు విప్పి చూడగా కొనఊపిరి ఉండడంతో యాజమాని బుచ్చయ్య చౌదరి కారులో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.


కలకాను పుటేల్ మృతదేహం

పేదింటి బిడ్డకు పెద్దకష్టం

- ఆరోగ్యం క్షీణిస్తోంది ఆదుకోండి
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న సతీశ్
- ఆపరేషన్ చేయించుకోలేని దుస్థితి
- సాయమందించి ప్రాణాలు నిలపాలని వేడుకోలు

దీన గాథ

పాలకుర్తిటౌన్: రంగురంగుల బొమ్మలాటల మధ్య జీవితం గడిపేవాడు. తన కుటుంబానికి తానే హీరో అనుకునేవాడు. తనను నమ్ముకున్న వాళ్లను ఉన్నతస్థానంలో నిలబెట్టాలని కలలు కనేవాడు. భార్యా పిల్లలతో జీవితం సాఫీగా సాగిపోతుందనుకున్న సమయంలో విధి వెక్కిరించింది. అరుదైన వ్యాధి కారణంగా అతడు మంచానికే పరిమితమయ్యాడు. అతడిని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడింది. చికిత్స చేయించే స్తోమత లేక ఆపన్నహస్తం కోసం ఇప్పుడా కుటుంబం ఎదురు చూస్తోంది.

అరుదైన వ్యాధి..

జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామానికి చెందిన 34 ఏళ్ల జిలుకర సతీశ్ సినిమా థియేటర్లో పని చేసేవాడు. వచ్చిన మొత్తంతో కుటుంబాన్ని పోషించేవాడు. అతడికి భార్య విజిత, ఇద్దరు కుమారులు లోకేశ్, ధన్విక్. తండ్రి మరణించడంతో తల్లికి తోడుగా నిలిచి కాయాకష్టం చేసి సోదరి మౌనిక వివాహం దగ్గరుండి జరిపించాడు. బాధ్యతలు తీరాయనుకునే సమయంలో 4 నెలల క్రితం సతీశ్ అనారోగ్యానికి గురయ్యాడు. హనుమకొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించగా.. కాలేయ సంబంధిత ప్రాంక్రియాస్ వ్యాధి బారిన పడినట్లు వైద్యులు నిర్ధారించారు. తప్పనిసరిగా ఆపరేషన్ చేయాలని, దానికి లక్షల్లో ఖర్చు ఉంటుందని వైద్యులు తెలపడంతోపేద కుటుంబం ఏం చేయాలో పాలుపోక కన్నీటి పర్యంతమైంది.

ఇప్పుడతడు ఎముకలగూడు!

క్రమక్రమంగా సతీశ్ కడుపులో గడ్డలు, నీటి బుడగలు ఏర్పడడంతో జీర్ణ వ్యవస్థ దెబ్బతిని ఆహారం తీసుకోవడం కష్టంగా మారింది. దీంతో ద్రవ రూప ఆహారం మాత్రమే తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు నెలల క్రితం బలిష్ఠంగా ఉన్న సతీశ్ ఆరోగ్యం క్షీణిస్తూ ఎముకల గూడు వలే తయారయ్యాడు. వ్యాధిని నయం చేసేందుకు ఆ పేద కుటుంబం అందినకాడల్లా అప్పులు చేసి వైద్యం చేయించారు. అయినా ఎలాంటి ఫలితం దక్కలేదు. ఇదిలా ఉండగా.. నెలకు రూ.5 వేల వరకు మందులకు ఖర్చవుతున్నాయి. ఓ వైపు పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారంగా మారింది. సతీశ్‌కు ఆపరేషన్ చేయిస్తే తిరిగి మామూలు స్థితికి చేరుకునే అవకాశం ఉంది. శస్త్ర చికిత్సకు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుండడంతో దిక్కు తోచని స్థితిలో ఆ పేద కుటుంబం దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. దాతలు స్పందించి పేద బిడ్డ ప్రాణాలు కాపాడాలని దీనంగా వేడుకుంటున్నారు.



సతీశ్‌కు అన్నం తినిపిస్తున్న కుటుంబసభ్యులు

దాతలు సాయం అందించాల్సిన ఫోన్, బ్యాంకు అకౌంట్ వివరాలు:
97016 84377 (ఫోన్ పే లేదా గూగుల్ పే)పాలకుర్తి
ఎస్‌బీఐ అకౌంట్ నంబర్: 2043 3814 533, ఐఎఫ్ఎస్‌సీ : ఎస్‌బీఐఎన్ 0014240

ప్రాణం తీసేందుకు పన్నాగం..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

కన్నాయిగూడెం : మూత్రవిసర్జనకు బయటికొచ్చిన ఓ వ్యక్తి ప్రాణం తీసేందుకు పథకం ప్రకారం అతడిపై విద్యుత్ వైర్లు వేయగా షాక్ తగలడంతో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని గంగాగూడెంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానిక ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాగూడేనికి చెందిన కావిరి రవీందర్ వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే కుటుంబంతో సహా ఫిబ్రవరి 29వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. అర్ధరాత్రి మూత్రం వస్తుందని బయటికి వచ్చాడు. కాగా ఇదే అదనుగా అదే గ్రామానికి చెందిన కావిరి ప్రమోద్ ముందస్తు పథకం ప్రకారం ప్రత్యేకంగా విద్యుత్ తీగను తగిలించిన ప్లాస్టిక్ పైప్ సాయంతో గుమ్మం ఎదుట కాపు కాస్తున్నాడు. తలుపు తీసి బయటికి వచ్చిన రవీందర్ పై విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు వేయడంతో రవీందర్ గాయపడి గట్టిగా అరిచాడు. అరుపులు విన్న కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వచ్చి విద్యుదాఘాతానికి గురైన రవీందర్‌ను రక్షించారు. ఇదంతా గమనించిన ప్రమోద్ అక్కడ నుంచి పారిపోయాడని రవీందర్ భార్య దేవి తెలిపారు. పారిపోతున్న ప్రమోద్ వద్ద ఓ కత్తి ఉందని, అది జారిపడిందని తెలిపారు. కొంత కాలం నుంచి ప్రమోద్ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అందులో భాగంగానే తన భర్తపై విద్యుత్ షాక్ ప్రయోగించి ప్రాణాలు తీయాలని పథకం పన్నాడని అన్నారు. గాయపడిన రవీందర్‌ను 108 వాహనంలో ఏటూరునాగారం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.


గాయపడిన రవీందర్